## బాలుడి రికార్డు పిచ్చి



ఎవరి పిచ్చి వారి కానందం. కొందరు అతిగా తిని రికార్డులు సృష్టించాలనుకుంటే, మరికొందరు పాటలు పాడి, నాట్యం చేసి అంతకు ముందున్న రికార్డులు బద్దలు కొట్టాలనుకుంటారు. కానీ నత్తగుల్లలు ముఖం మీద పెట్టుకొని రికార్డు సృష్టించాలన్న ఆలోచన తక్కువ మందికి వస్తుంది. అసలు నత్తగుల్లలను చూస్తూంటేనే శరీరం గగుర్పొడుస్తుంది. ఇక ఏకంగా వాటిని ముఖం మీద కొన్ని సెకన్ల పాటు ఉంచుకోవాలంటే ఎలా ఉంటుందో ఊహకు అందని విషయం. అలాంటిది ఓ పదకొండు సంవత్సరాల పిల్లవాడికి ఆ ఆలోచన వచ్చింది. ఈ విషయంలో రికార్డు నెలకొల్పాలని ఆ పిల్లవాడు అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా తన ఆలోచనను అమలు చేశాడు. రికార్డు సృష్టించాడు. దీనికి సంబంధించిన వివరాలు...

శాండి నగరానికి చెందిన ఉతాహ్ అనే పిల్లవాడు సుమారు 43 నత్తగుల్లలను పది సెకన్ల పాటు ముఖం మీద పెట్టుకొని రికార్డు సృష్టించినట్లు అధికారులు ధృవీకరించారు. 2007వ సంవత్సరంలో ఓ వ్యక్తి 36 నత్తగుల్లలను సుమారు ఎనిమిది నిమిషాల పాటు ముఖం మీద పెట్టుకొని రికార్డు సృష్టించాడని, ఆ తరువాత ఎవరూ ఇంత వరకూ ఆ రికార్డును అధిగమించలేదని అధికారులు తెలిపారు. కాకపోతే ఉతాహ్ మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించలేదని, రెండు మూడు సార్లు ప్రయత్నించిన తరువాత విజయం సాధించినట్లు వారు వివరించారు.

## అతిగా మద్యం సేవించి పెళ్లికొడుకు మృతి



పెళ్లి అనేది జీవితంలో ఒకే ఒక్క సారి వచ్చే వేడుక. దీనిని ఎంత ఘనంగా జరుపుకుంటే అంత గొప్ప అనుకునే వారే ఎక్కువ. ఆరోజు కేవలం ఆడంబరాలకే లక్షలకు లక్షలు ఖర్చు పెడుతూంటారు. పెళ్లి రోజు సంతోషం ఎక్కువై కొందరు ఆడతారు, పాడతారు మరికొందరు మద్యం సేవిస్తారు. ఇదంతా సంతోషానికి సంకేతంగా భావిస్తారు. సంతోషంలో విషాదం అన్నది చోటు చేసుకోకూడదు. కానీ ఆ పెళ్లి వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. అతిగా మద్యం సేవించడంతో పెళ్లికొడుకు చనిపోయిన సంఘటన తైవాన్‌లో జరిగింది. దీనికి సబంధించిన వివరాలు

తైవాన్‌కి చెందిన 'వూ' అనే వ్యక్తి స్థానిక ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల అతని వివాహం జరిగింది. పెళ్లి రోజు సంప్రదాయంలో భాగంగా ఓ రెస్టారెంట్‌లో కూర్చుని అందరితో పాటు అతనూ మద్యం సేవించాడు. అయితే 'వూ' మోతాదుకు మించి తాగడంతో మరణించాడు. అంతకు ముందే 'వూ' ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని, దానికి తోడు అతిగా తాగడంతో మరణించాడని డాక్టర్లు నిర్ధారించారు.

'వూ' తాగడం మొదలు పెట్టిన కొద్ది సేపటికే అతని ముఖం నల్లగా మారడంతో వెంటనే వైద్యం కోసం హాస్పిటల్‌కి తరలించినట్లు తెలిసింది. 'వూ'ని వైద్యం కోసం హాస్పిటల్‌కి తీసుకువచ్చే లోపే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు.

## 'సరసి'కత

వైశంపాయనుడు హైదరాబాదు నాంపల్లిలో ఉద్యోగం వెలగబెట్టిన రోజుల్లో శుద్ధోదనుడు అనే ఆఫీసరు చాలా స్ట్రిక్టుగా వుండేవాడు. పొద్దస్తమానూ కింద వాళ్లను పిలిచి ఆ పనులూ ఈ పనులూ చెబుతూ వుంటాడని, బయట పనులు కూడా చేయించుకుంటాడని స్టాఫ్‌కి ఆయనంటే మంట.

ఓ రోజు సాయంత్రం నాలుగున్నరకి వైశంపాయనుడిని పిలిచాడు శుద్ధోదనుడు. ''మహానుభావుడేం పనిచెబుతాడో, తెలివిగా ఏదో ఒకటి చెప్పి తప్పించుకోవాలి'' అనుకుంటూ లోపలికి వెళ్లాడు వైశంపాయనుడు.

''ఏమయ్యా, నువ్వుండేది మలక్‌పేటలో కదూ. కాస్త ముందుకెల్లి దిల్‌షుక్ నగర్‌లో మన అఖిలాండం గారున్నారు చూడు, ఆయనకీ కవరిచ్చేసి పో'' అన్నాడు శుద్ధోదనుడు ఓ కవరు వైశంపయానుడి చేతికిస్తూ. పని ఎగ్గొట్టే ఆలోచనతో వున్న వైశంపాయనుడు ''సారీ సర్. నేనీ రోజు మా యింటికి వెళ్లడం లేదు. కూకట్ పల్లిలో మా షడ్డ



# పనిదొంగ

కుడింట్లో పూజ ఉంది. అక్కడ కెడుతున్నా'' అంటూ పుసుక్కున అబద్ధం ఆడేశాడు. భలే బాగా తప్పించుకున్నానని లోపల్లోపలే సంబరపడిపోయాడు వైశంపాయనుడు.

అయితే అంతకంటే ఎక్కువ సంబరంతో బాస్ ఓ వెర్రికేక పెట్టేడు. ''బతికించేవయ్యా బాబూ. కూకట్ పల్లి కవరొకటుంది. అది ఎలా పంపాలా అని మధ్యాన్నం నించి మధనపడి ఛస్తున్నాను. అక్కడ ఫోర్తు ఫేజ్‌లో జగత్పతి గారని వుంటారు. బాబ్బాబు, ఈ కవరాయన కిచ్చేసి, ఫోన్ చెయ్యమన్నానని చెప్పు'' అంటూ డ్రా సొరుగులోంచి వేరే కవర్ తీసిచ్చాడు శుద్ధోదనుడు.

వైశంపాయనుడు బిక్క చచ్చిపోయాడు. నిజానికి తను కూకట్ పల్లి వెళ్లడం లేదు. పని తప్పించుకోవడం కోసం ఏదో నోటికొచ్చిన అబద్ధం ఆడేశాడు. అర కిలోమీటరు వెళ్లడానికి బద్ధకించినందుకిపుడు నాంపల్లి నుంచి రానూపోనూ ముప్ఫయ్ కిలోమీటర్లు అదనంగా మీటరు పడింది. తనని తాను తిట్టుకుంటూ బాస్ రూమ్‌లోంచి బైటకు వచ్చాడు వైశంపాయనుడు, ఏడుపు మాత్రం బయటకు రాలేదు!

*